



రామశాస్త్రికి ఆ రోజు వంట్లో బావుండక ఇంట్లోనే ముసుగు తన్ని పడుకున్నాడు ఆ రోజునే కాదు, గత కొన్ని రోజులుగా ఆయన ఆరోగ్యం బావుండటం లేదు.

అప్పుడు ఉదయం ఎనిమిది గంటలు దాటుతున్నది. కిటికీలో నించి పలుచని ఎండ ఆయన మీదకు పడుతోంది.

**వరండాలో ఎవరివో మాటలు ఆయనకి వినిపిం**చాయి. ఆ మాటలు చంద్రశేఖరానివిగా ఆయన గుర్తించాడు.

క్షణం తర్వాత చంద్రశేఖరం లోపలికి వచ్చి "గురువుగారూ... మీ ఆరోగ్యం ఎలావుంది?" అనడిగాడు మంచం దగ్గరగా నిలబడి.

"ఏమీ మార్పు లేదు. ఈ రోజు కూడా వీలుపడదు. రేపు ఉదయం కనపడు..." అన్నాడు నీరసంగా రామశాస్త్రి.

"సర్లెండి. వస్తాను." అని వెళ్ళిపోయాడు చంద్రశేఖరం.

అతని వయసు పదహారు. అతను రామశాస్త్రి దగ్గర మంత్రాలు నేర్చుకుంటున్నాడు. అతను పదవ తరగతి పూర్తి చేసిన తర్వాత చదువుమానేసి వైదిక వృత్తిలోకి దిగిపోయాడు

అతను బయటకు వెళ్ళగానే రామశాస్త్రికి ఆయన పెద్దకొడుకు నిరంజనం గుర్తుకు వచ్చాడు.

నిరంజనం కూడా పదేళ్ళ క్రితం పదవ తరగతి పూర్తి చేశాడు. అప్పుడే రామశాస్త్రి అతన్ని తన దగ్గర మంత్రాలు నేర్చుకుని తన వృత్తినే స్వీకరించమని అడిగాడు.

నిరంజనం నవ్వి "పురోహితమా?" అన్నాడు.

"అవును. ఇప్పుడు నువ్వు పై చదువులు చదివినా మంచి ఉద్యోగం ఏదైనా వస్తుందనే నమ్మకం ఏముంది?" అన్నాడు రామశాస్త్రి.

"రాదనే నమ్మకం కూడా లేదుకదా... పిలక పెట్టుకుని మంత్రాలు చదవటం నావల్ల కాదు. మంత్రాల గురించి నా దగ్గర ఇంకోసారీ మాట్లాడకు' అన్నాడు.

తల్లి కూడా కొడుకునే సపోర్టు చేసింది.

"మీ వృత్తిమీద ఇప్పుడు గౌరవం తగ్గి పోతోంది.. వాడ్ని ఏదయినా వేరే ఉద్యోగం చెయ్యనివ్వండి." అన్నది...

"నీకు తెలీదు. ఎంత గౌరవం తగ్గిపోయినా ఇది స్వతంత్రమైన వృత్తి. తిండికి లోటు లేనిది. వాడ్ని చెడగొట్టకు" అన్నాడాయన.

అయినా ఆమె వినలేదు. నిరంజనాన్ని ఇంటర్‌లో చేర్పించింది పట్టుదలతో. అతను కూడా ఎంతో ఆసక్తిగా కాలేజీలో చేరాడు. కొడుకు కాలేజీ చదువు అదనపు భారమే అనిపించినా నిరంజనం ఏదో గొప్ప ఉద్యోగస్తుడవుతాడనే ఆశతో రామశాస్త్రి మవునం పూనాడు.

కాని ఆయన అనుకున్నట్టుగా ఏదీ జరగలేదు. కాలేజీలో చేరిన మూడు నెల్లకే నిరంజనానికి చదువుమీద ఆసక్తి పూర్తిగా పోయింది కాలేజీ రాజకీయాలు, అల్లర్లలోకి దిగిపోయాడు. ఆ కారణంగా అతడి చదువు మధ్యలో నే ఆగిపోయింది

ఆ చదువుతోనే ఏదో గొప్ప ఉద్యోగాన్ని సంపాదించాలనే భ్రమలో వుండిపోయాడు నిరంజనం. కాని- డిగ్రీలు వుండికూడా నిరుద్యోగులుగా తిరుగుతున్న మనుషులను చూసిన తర్వాత అతడికి తన ఉద్యోగం గురించి గొప్ప నిరుత్సాహం కలిగింది. అయినా అతడేమీ బాధపడలేదు. ఎందుకంటే ప్రస్తుతం అతడి తండ్రి సంపాదిస్తున్నాడు. తిండికి ఇబ్బంది ఏమీలేదు.

తన ఆశలను కూల్చివేసినా కొడుకును క్షమించి తన వృత్తిలోకి దిగమని చాలాసార్లు చెప్పాడు రామశాస్త్రి అయినా తనకు తెలిసిన గర్ల్ ఫ్రెండ్స్‌ను దృష్టిలో వుంచుకుని తన వేషాలు మార్చుకుని పురోహితంలోకి దిగటానికి నిరంజనం మనసు అంగీకరించలేదు.

ఈసారి అతడి తల్లి కూడా తండ్రి చెప్పినట్టుగా వినమన్నది. ఐనా నిరంజనం వినలేదు –

ఈ మధ్యనే కొన్ని రోజులనించీ చంద్రశేఖరం రామశాస్త్రి దగ్గరకు మంత్రాలు నేర్చుకోటానికి వస్తున్నాడు. అతనితో పాటు కొడుకును కూడా నేర్చుకోమని మరోసారి ఎంతో ప్రేమగా అడిగాడు రామశాస్త్రి కాని నిరంజనం ఎంతో కోపంగా ఈసారి అలా అడిగితే ఇల్లు విడిచి వెళ్ళిపోతానని గట్టిగా చెప్పేశాడు. ఆమాటకు తల్లి భయపడి ఇంకెప్పుడూ ఈ విషయం గురించి మాట్లాడమని కొడుక్కి హామీ ఇచ్చింది

అందువల్లనే ఈ రోజుకీ నిరంజనం వూరంతా తిరిగి ఏదో ఒక టైముకు ఇంటికి వస్తున్నాడు

"కాఫీ తీసుకోండి."

భార్య మాట విన్పించి ఆలోచనలనించి బయటపడ్డాడు రామశాస్త్రి. ముసుగు తీసి చూశాడది

వంగిపోయిన నడుముతో భార్య కనిపించింది.

చిన్నగా లేచి కూర్చుంటూ "రెండో వాడిని ఆచార్లు గారింటికి పంపించావా?" అనడిగాడు.

"ఆ" అన్నదామె

"పెద్దాడు లేచాడా?" కాఫీ తాగుతూ మధ్యలో అడిగాడు.

"రాత్రి పొద్దుపోయి వచ్చాడు కదూ. ఇంకా లేవలే" అని–

"ఇక వాడి గురించి ఆలోచనలు మానెయ్యండి మీకు వంట్లో సుస్తీ ఏమీలేదు అంతా దిగులే.. నాకు తెలుసు" అన్నది.

ఆమె అలా అనగానే "నీకు మాత్రం వాడి గురించి దిగుల్లేదా?" అన్నట్టుగా భార్యను చూశాడు రామశాస్త్రి

అప్పుడే రామశాస్త్రి రెండో కొడుకు ఆచార్లుగారిని మందుల పెట్టెతో తీసుకు వచ్చాడు

**********

ఎన్ని మందులు వాడినా రామశాస్త్రి ప్రాణం నిలవలేదు – ఎన్నో రోజులు..

## నాలుగో మనిషి

కొన్ని రోజుల తర్వాత రామశాస్త్రి కొడుకు గురించిన దిగులుతోనే ఈ లోకం నించి సెలవు తీసుకున్నాడు.

తండ్రిపోయిన తర్వాతనే ఆ లోటు ఏమిటో నిరంజనానికి మొదటిసారిగా తెలిసింది. తండ్రి చావుకు తనే కారణమని తల్లి అన్నప్పుడు నిరంజనానికి దుఃఖం ఆగలేదు. బిగ్గరగా ఏడ్వాలనిపించింది. ఆ మాట నిజమేననిపించింది గొప్ప నేరం చేసిన వాడిలా వణికిపోయాడు.

ఎంత బాధపడినా – పశ్చాత్తాపం పొందినా అతడు ఇక చెయ్యగలిగింది ఏదీ లేదు

కుటుంబం బజారున పడిన తర్వాత తనెంత గొప్ప పొరపాటు చేశాడో అతడికి అర్థమయ్యింది. ఆసమయంలో చంద్రశేఖరంని చూస్తే అసూయ కలిగింది **తన తండ్రి** దగ్గర నేర్చుకున్న నాలుగు మంత్రాలతోనే అతడు చిన్న చిన్న పనులు చేయించి పదహారేళ్ళ వయసులోనే రోజూ ఎంతో కొంత డబ్బు సంపాదిస్తున్నాడు ఖుక్కకి ఇబ్బంది లేదు.

**కాని తను ఇన్నేళ్ళొచ్చి?**

నిరంజనానికి ఎవరిమీదనో కసిగా అనిపించింది.

తమ్ముళ్ళు – చెల్లెళ్ళు ఇంకా చిన్నవాళ్ళే. వాళ్ళు చెయ్యగలిగింది ఏమీలేదు

రామశాస్త్రి పోయిన తర్వాత మొదటిసారిగా ఆ కుటుంబం అంతా ఒకరోజు పూర్తిగా ఉపవాసం చెయ్యవలసి వచ్చింది. ఆ రాత్రి నిరంజనం తల్లితో పాటు ఆమెకు తెలియకుండానే దూరంగా ఎక్కడో కూర్చుని చాలాసేపు ఏడ్చాడు.

తెల్లవారిన తర్వాత సూర్యోదయం అయిన కాసేపటికి నిరంజనం రెండో తమ్ముడు రాగి చెంబును తోముకుని దాన్ని తసుకుని ఉపాదానంకి బయల్దేరినప్పుడు అతడి గుండె తరుక్కుపోయింది. ఎర్రగా వెలుగుతున్న చింతనిప్పుల మీద నిలబెట్టినట్టు కూడా అనిపించింది.

ఇంట్లో వుండలేక బయటకు వచ్చాడు నిరంజనం.

కొంత దూరం నడిచాడు. శివాలయం వచ్చింది. ఆగిపోయాడు. ఆలయం ముందు వున్న రావిచెట్టు కింద పెద్ద బండ మీద కూర్చుండిపోయాడు.

అతనికి దిగులుగా వుంది. బాధగానూ వుంది. భయంగా కూడా వుంది.

రావిచెట్టు కింద నీడగా వుంది ఎండ ఆకుల మధ్య నుంచి పల్చగా పడుతోంది.

రోడ్మున పోతున్న మనుషులెవరూ నిరంజనాన్ని పట్టించుకోవటంలేదు

ఆ మనుషుల్లో అతనికి తెలిసిన వాళ్ళు ఎవరూ లేరు కాని అప్పుడే ఒకాయన అక్కడికి వచ్చాడు ఎగురుకుంటూ – ఆయన్ని గుర్తించాడు నిరంజనం. అప్పుడప్పుడు తండ్రి దగ్గరకు వస్తూండేవాడు. ఆయన పేరు పుల్లయ్య. శవాలను మోస్తుంటాడు. శనిదానాలు కూడా పడతాడు.

ఎదురు రోడ్డులో నించి ఎవరో ఇద్దరు ఖరీదైన దుస్తులు వేసుకున్న మనుషులు వచ్చి పుల్లయ్యను కలుసుకుని ఏదో చెప్పారు.

"ఎప్పుడు పోయాడు?" అడిగాడాయన.

"రాత్రి" చెప్పారు వాళ్ళు

"ఎంతిస్తారు?"

"మనిషికి పాతిక"

కాదు. యాభై ఇవ్వందే ఎవరూ దొరకరు."

కొంచెంసేపు ఆలోచించి "సరే పదండి" అన్నారు.

"ఎంత మంది కావాలి?"

"నలుగురు"

"నలుగురా? నేను – ఇంకో ఇద్దరం వున్నాం.. **నాలుగో మనిషిని ఎక్కడయినా వెతకండి"**

"మా కెవరు తెలుసు? నాలుగో మనిషిని కూడా మీరే తీసుకురండి" అన్నారు వాళ్ళు.

నిరంజనం ఇక ఆలస్యం చెయ్యలేదు.

"నాలుగో మనిషిగా నేనొస్తాను" అంటూ బండ మీద నించి వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు "

"నువ్వా? నువ్వు రామశాస్త్రిగారి అబ్బాయివి కదూ?" అన్నాడు పుల్లయ్య

"అవును"

"నువ్విలాంటి పనుల్లోకి దిగటం నాకు ఇష్టం లేదు. మీ అమ్మకు తెలిసిందంటే?"

"ఎవరికి తెలిసినా నాకు ఇబ్బంది లేదు. మీరు మాట్లాడకండి.. పదండి. నేనే నాలుగో మనిషిని"

ఇక ఆయన మాట్లాడలేదు ఏమనుకున్నాడో మనసులో" ముందుకు కదిలాడు.

వాళ్ళతో నడుస్తూ నిరంజనం మనసులో ఇలా అనుకున్నాడు.

"నాన్నా – ఏ పని చేసైనా సరే కుటుంబ పోషణ భారాన్ని మోస్తాను. అహంకారంతో నిన్ను పోగొట్టుకున్నందుకు ఇది నాకు నేను విధించుకుంటున్న శిక్ష" ◘

